సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింది ఫోన్ నంబరుకు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

దివ్యాంగులకు భోజనాల పంపిణీ



వృద్ధులు, దివ్యాంగులకు భోజనాలు వడ్డిస్తున్న సోమేష్

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం ప్రాంతానికి చెందిన మజ్జి సోమేష్ శుక్రవారం వృద్ధులు, దివ్యాంగులకు భోజనాలు పంపిణీ చేశారు. సోమేష్ మాట్లాడుతూ తన తండ్రి చూపిన బాటలో నడుచుకుంటున్నానని, పరుల సేవ ఎంతో తృప్తి ఇస్తుందన్నారు. అలాగే గాజువాక సమీపంలోని అనాథ ఆశ్రమం,వృద్ధాశ్రమంలో ఉన్న వారికి భోజనాలు,పండ్లు అందించారు.

బుద్ధ శివాజీకి సత్కారం



శివాజీని సత్కరిస్తున్న ఆనంద్‌కుమార్

గోపాలపట్నం: కేంద్ర గౌరీసేవా సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన బుద్ధ శివాజీని శుక్రవారం పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ గోపాలపట్నంలోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ శివాజీ గౌరీ సేవా సంఘం బలోపేతానికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని అభినందించారు. ఆయనతోపాటు బెహరా భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీకాలనీలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన వైఎస్సార్‌సీపీ నాయకుడు జెర్రిపోతుల అప్పలనాయుడు కుటుంబాన్ని శుక్రవారం పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ పరామర్శించారు. కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావుతో కలిసి మృతుని కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. పిల్లల చదువుకు సాయమందిస్తామన్నామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్, మహేష్, అశోక్, శ్యామ్, బాలకృష్ణ, తాతబాబు, కృష్ణహరి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

గోపాలపట్నం: జీవీఎంసీ 91, 92 వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు శంకుస్థాపనలు చేశారు. గోపాలపట్నం పెట్రోల్ బంక్ జంక్షన్ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15వ ఆర్థిక నిధులు రూ.35 లక్షలు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. 91వ వార్డు పాతగోపాలపట్నంలో బీటీ రోడ్ల పనులకు జీవీఎంసీ నిధులు వెచ్చిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆడారి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో అంచెలంచెలుగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఇటీవలే 52వ వార్డులో టీడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించామని చెప్పారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి, గేదెల మురళీకృష్ణ. పొట్నూరు శంకరరావు, పసుపురెడ్డి రమణ, తదితరులు పాల్గొన్నారు.



పాతగోపాలపట్నంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఆనంద్‌కుమార్, బెహరా భాస్కరరావు

57వ వార్డులో..

కంచరపాలెం: జీవీఎంసీ 57వ వార్డు ఊర్వశికూడలి సుభాష్‌నగర్‌లో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, వార్డు కార్పొరేటర్ ముర్రువాణి శంకుస్థాపన చేశారు. సుమారు రూ.36 లక్షలతో గెడ్డ రిటర్నింగ్ వాల్, గెడ్డ వంతెన పనులకు నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభించినట్లు జోన్–5 ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. బాకి శ్యామ్‌కుమార్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌చార్జి మంత్రి దృష్టికి సమస్యలు



మంత్రి విడదల రజినికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు శుక్రవారం నగరానికి వచ్చారు. ఈ మేరకు ఆమెను వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ సర్క్యూట్ హౌస్‌లో కలిశారు. పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ప్రగతిలో ఉన్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. కొండ వాలు,మురికివాడల్లో ఏర్పాటు కావాల్సిన వైద్య కేంద్రాల తదితర అంశాలపై ఆమెతో చర్చించారు.

డిప్యూటీ మేయర్ జియ్యాని భేటీ

జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ శుక్రవారం ఇన్‌చార్జి మంత్రి విడదల రజినితో భేటీ అయ్యారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అదనపు సదుపాయాలు కల్పించాలని ఆమెకు వినతిపత్రం అందించారు.

ఘనంగా చందనోత్సవం



చాదర్ తీసుకెళ్తున్న ముస్లింలు

మర్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు మర్రిపాలెం రైల్వే క్వార్టర్స్‌లోని హజ్రత్ కాజా గరీబ్ నవాజ్ నిషాని వద్ద కేజీఎన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం చందనోత్సవం ఘనంగా నిర్వహించారు. ముస్లింలు ఉదయం మసీదు ప్రాంగణంలో ఖురాన్ పఠించారు. సాయంత్రం చిన్నారులు నాత్తే కళాములు ఆలపిస్తూ మర్రిపాలెం, హుస్సేన్‌నగర్, గ్రీన్ గార్డెన్స్, పార్వతీనగర్ ప్రాంతాల్లో చాదర్(పవిత్ర వస్త్రం)తో చందనోత్సవ ర్యాలీ చేశారు. వేడుకల్లో భాగంగా శనివారం ప్రముఖ మత పెద్దలతో తక్రీర్(బయాన్) పఠించి దావత్ నిర్వహిస్తామని ఉర్సు కమిటీ సభ్యులు తెలిపారు. చందనోత్సవం అనంతరం చాదర్‌ను అజ్మీర్ షరీఫ్‌లోని హజ్రత్ కాజా గరీబ్ నవాజ్ సమాధి వద్ద సమర్పిస్తామన్నారు. పెద్ద సంఖ్యలో స్థానిక ముస్లింలు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం



మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు కోరమాండల్ సమీపంలోని అజంతకాలనీలో నివాసం ఉంటున్న వాసుపల్లి జయంత్ అనే యువకుడు కనిపించడం లేదని తల్లిదండ్రులు వాసుపల్లి వెంకటేశ్వరరావు,విజలక్ష్మి మల్కాపురం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు శుక్రవారం తెలిపిన వివరాలు.. జయంత్ గాజువాక లోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. రోజు మాదిరి గానే గత నెల 31వ తేదీన ఉదయం 8.45 నిమిషాలకు కళాశాలకు వెళ్లి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో ఓ సారి కళాశాలకు వెళ్లి తిరిగి వచ్చే సమయంలో బస్సులో పడుకుని దూర ప్రాంతానికి వెళ్లి పోయి ఆ మరుసటి రోజు జయంత్ వచ్చాడని, అదే మాదిరిగా తిరిగి వస్తాడని అనుకున్నామని రోజులు గడుస్తున్నా రాకపోవడంతో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. కేసును మల్కాపురం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమైన బాలికకు యువకుడితో పెళ్లి!

- పోలీసులకు తల్లిదండ్రుల ఫిర్యాదు

మల్కాపురం: కళాశాలకు వెళ్లి అదృశ్యమైన బాలిక(మైనర్) ఓ యువకుడిని పెళ్లి చేసుకుని తల్లిదండ్రులకు షాక్ ఇచ్చింది. ఈ కేసుకు సంబంధించి మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలు.. హనుమాన్‌నగర్ ప్రాంతానికి చెందిన యువతి స్థానిక కళాశాలలో ఇంటర్ చదువుతోంది. అయితే గత నెల 24న కళాశాలకు వెళ్లిన 17 ఏళ్ల యువతి సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాలేదు. దీంతో తల్లిదండ్రులు కలవరం చెంది కళాశాలకు వెళ్లి విచారించారు. అయితే రావికమతం ప్రాంతానికి చెందిన సిద్ధు అనే యువకుడితో పెళ్లి అయిందని తల్లిదండ్రులు తమ విచారణలో తెలుసుకున్నారు. కాగా గతంలో సిద్ధు తన కుమార్తెకు మాయ మాటలు చెప్పి తీసుకు వెళ్లిపోయాడని, అప్పుడు పెద్దల సమక్షంలో ఇంటికి తీసుకువచ్చానని,మరలా ఈ నెల 24న ద్విచక్ర వాహనంపై తన కుమార్తెను సిద్ధు తీసుకు వెళ్లి రహస్యంగా పెళ్లి చేసుకున్నాడని యువతి తల్లిదండ్రులు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

చెత్త కుప్పల తొలగింపు



పరిశుభ్రంగా గురజాడ నగర్ రహదారి

సాక్షి ఎఫెక్ట్..

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు శానిటరీ అధికారులు స్పందించారు. గురజాడ నగర్‌లో రోడ్డుపై అడ్డంగా వేసిన చెత్తను తొలగించారు. ఇక్కడ వేసి వదిలేసిన పూడికతో స్థానికులు పడుతున్న ఇబ్బందులపై 'సాక్షి'లో శుక్రవారం 'అడుగు తీసి వేయలేం..' అనే శీర్షికన ప్రచురితమైన వార్తకు పారిశుధ్య అధికారులు వెంటనే స్పందించారు. ఈ వీధిలో చెత్త కుప్పలను తొలగించి రోడ్లన్నీ అద్దంలా మెరిసిపోయేలా చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

అభివృద్ధి పనుల పరిశీలన

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు సీతారామరాజునగర్ పార్క్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను వార్డు కార్పొరేటర్ బొమ్మిడి మరణ శుక్రవారం పరిశీలించారు. షెల్టర్, వాకింగ్ ట్రాక్, ఆర్చి పనులు చేపడుతున్నామని ఆయన తెలిపారు. నాణ్యతలో రాజీలేకుండా పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ విజయ్ కుమార్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, స్థానికులు గణపతి రాజు, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

'ఫైన్ ఆర్ట్స్' విభాగం సందర్శన

ఏయూ క్యాంపస్: శివాజీపాలెంలోని ఆంధ్రా యూనివర్సిటీ ఫైన్ ఆర్ట్స్ విభాగాన్ని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు శుక్రవారం సందర్శించారు. విభాగం విద్యార్థులు తయారు చేసిన రాతి, చెక్క బొమ్మలు, పెయింటింగ్ చిత్రాలు, శిల్పాలు, ఆర్ట్స్ గ్యాలరీ, స్టూడియోలను తిలకించి, అవి తయారు చేసే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. చాలా బాగున్నాయని కమిషనర్ అభినందించారు. వీటిని సందర్శకులకు అందుబాటులో ఉంచితే బాగుంటుందని చెప్పారు. ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఎస్.కిషోర్‌బాబు, పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, జీవీఎంసీ అదనపు కమిషనర్ వై.శ్రీనివాసరావు, విభాగాధిపతి ఆచార్య డి.సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.



చిత్ర కళావిభాగాన్ని పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

బాక్సింగ్‌లో మల్కాపురం బాలికల సత్తా



బంగారు పతకంతో సత్తా చాటిన ప్రవల్లిక



గోల్డ్ మెడళ్లు సాధించిన అక్కాచెల్లెళ్లు సాయిదివ్య, నందినిశ్రీ

- రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకాలు

మల్కాపురం: జిల్లా పాఠశాలల క్రీడా సంఘం ఆధ్వర్యంలో గత నెల 31 నుంచి ఈ నెల 2 వరకు రాజమహేంద్రవరంలోని ఎస్.కె.వి.టి.ప్రభుత్వ పాఠశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో మల్కాపురానికి చెందిన ముగ్గురు బాలికలు సత్తా చాటారు. మల్కాపురం గొల్ల వీధికి చెందిన వాకాడ ప్రవల్లిక యాదవ్ 63 – 66 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించింది. జనతా కాలనీకి చెందిన అక్కాచెల్లెళ్లు బంగారు పతకాలు గెలుపొందారు. 54 – 57 కేజీల విభాగంలో సాయిదివ్య, 66 – 70 కేజీల విభాగంలో నందినిశ్రీ గోల్డ్ మెడళ్లు సాధించారు. మల్కాపురంలోని తమ ఇళ్లకు చేరుకున్న వీరిని శుక్రవారం వేరు వేరుగా పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు సీనియర్ బాక్సర్లు, వివిధ పార్టీల నాయకులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

ఆడారి ఆనంద్‌కుమార్‌కు అభినందనలు



ఆడారి ఆనంద్‌కుమార్‌కు శాలువా వేసి అభినందిస్తున్న కార్పొరేటర్లు, నాయకులు

మల్కాపురం: విశాఖ డెయిరీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు కార్పొరేటర్లు శుక్రవారం ఆయనను కార్యాలయంలో కలిసి శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా 60వ వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు పి.వి.సురేష్, 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధలు మాట్లాడుతూ తండ్రిని మించిన తనయుడిగా పేరు పొందాలని ఆకాంక్షించారు. ఆనంధ్‌కుమార్‌ను కలిసిన వారిలో పార్టీ నాయకులు బిల్డర్ సంతోష్, నేవి అనిల్ తదితరులు ఉన్నారు.

61వ వార్డు సమస్యల పరిష్కారానికి చర్యలు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డులో శుక్రవారం వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ పర్యటించారు. జనతా కాలనీలో అధ్వానంగా ఉన్న బీటీ రోడ్లను, గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాలను, ఇతర సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో భాగంగా త్వరలో జనతా కాలనీలోని పలు ప్రాంతాల్లో బీటీ, సీసీ రోడ్లను నిర్మింప జేయిస్తామన్నారు. ఇక్కడ గెడ్డపై వెలసిన ఆక్రమణల వల్ల పూడిక తీయలేని పరిస్థితి ఏర్పడుతోందని, టౌన్ ప్లానింగ్ అధికారులతో మాట్లాడి ఆక్రమణలను తొలగించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం ప్రకాష్‌నగర్‌లో పర్యటించి స్థానికులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆడారి ఆదేశించారు. పర్యటనలో ట్రేడ్ యూనియ్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రినాథ్, వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ, 60వ వార్డు కార్పొరేటర్ ,స్టాండింగ్ కమిటీ సభ్యుడు పి.వి.సురేష్, దాడి సత్యనారాయణ, ఐటీ విభాగ ప్రతినిధి కొల్లి నూకరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జనతా కాలనీలో పర్యటిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

భావితరాలకు నైపుణ్య ఆధారిత విద్య

కంచరపాలెం: భావితరాల వారికి నైపుణ్యత కలిగిన విద్యను అందించాలని ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ చీఫ్ కో–ఆర్డినేటింగ్ అధికారి బుద్ధ చంద్రశేఖర్ పేర్కొన్నారు. నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రెండో రోజు శుక్రవారం కంచరపాలెం పాత ఐటీఐలో అప్రెంటిస్‌షిప్ జాతీయ వర్క్‌షాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 300కు పైగా పరిశ్రమలు కేంద్ర ప్రభుత్వ విధానాలను స్వాగతిస్తూ విద్యార్థులకు అప్రెంటిస్‌షిప్‌కు అవకాశం కల్పిస్తున్నాయని తెలిపారు. భవిష్యత్‌లో స్కిల్ బేస్డ్ ఎడ్యుకేషన్‌కు ప్రాధాన్యమివ్వాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఎస్డీ ఆంధ్రప్రదేశ్–తెలంగాణ ప్రాంతీయ సంచాలకుడు కె.శ్రీనివాసరావు, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ చైర్మన్ అజయ్‌రెడ్డి, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సుబ్బిరెడ్డి, జన శిక్షణ సంస్థ చైర్మన్ రామరాజు, కంచరపాలెం, గాజువాక ఐటీఐల ప్రిన్సిపాళ్లు బి.ప్రభాకర్‌రావు, ఎ.కె.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతిశీల ఆలోచనలతో కేంద్ర బడ్జెట్

ఏయూక్యాంపస్: ప్రగతిశీల ఆలోచనలతో కేంద్ర బడ్జెట్ రూపొందించారని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి అన్నారు. ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన 'యూనియన్ బడ్జెట్–2023' చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విశ్వవిద్యాలయాలకు జీఎస్టీ నుంచి మినహాయింపు ఇవ్వడం, కొంత వెసులుబాటు కల్పించడం ఎంతో అవసరమన్నారు. డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కల్పనకు కేంద్రం ప్రత్యేక దృష్టి సారించడం శుభ పరిణామమన్నారు. ఇది ప్రగతిశీల ఆలోచనగా నిలుస్తుందన్నారు. భవిష్యత్ అంతా సాంకేతిక విప్లవం, సవాళ్లకు ఆస్కారం ఉంటుందన్నారు. దీనికి అనుగుణంగా యువతరం తమను తాము మెరుగు పరచుకోవాలని సూచించారు. ఏయూలో స్కూల్స్ కాన్సెప్ట్‌ను అమలు చేస్తూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగాన్ని స్కూల్‌గా మార్పు చేస్తామన్నారు. నూతనంగా ఇంక్యుబేషన్ సెంటర్ నెలకొల్పి, స్టార్టప్ కల్చర్‌ను ప్రోత్సహిస్తామన్నారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎ.కిశోర్ బాబు, ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, సింహపురి వర్సిటీ పూర్వ ఉపకులపతి ఆచార్య ఆర్.సుదర్శనరావు, చార్టెడ్ అకౌంటెంట్ ఆకుల చంద్రశేఖర్, పూర్వ ప్రిన్సిపాల్ ఆచార్య డి.ప్రభాకరరావు, ఏయూ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, డీసీఎంఎస్ విభాగాధిపతి ఆచార్య జాలాది రవి కేంద్ర బడ్జెట్‌పై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

సంస్కృతి సంప్రదాయాలు కాపాడాలి

నెహ్రూ యువ కేంద్రం రాష్ట్ర సంచాలకురాలు విజయరావు

మహారాణిపేట: భారతీయ సంస్కృతి సంప్రదాయాలపై యువత అవగాహన పెంచుకోవాలని నెహ్రూ యువ కేంద్రం రాష్ట్ర సంచాలకురాలు ఎ.ఆర్.విజయరావు సూచించారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, యువజన క్రీడా మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నెహ్రూ యువ కేంద్రం, విశాఖ ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న 14వ ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ ముగింపు కార్యక్రమం శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా విజయరావు మాట్లాడుతూ సభ్యత సంస్కారానికి, సంస్కృతి,సంప్రదాయలకు భారతదేశం నిలయమన్నారు. అందుకే మనదేశం మిగతా దేశాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. యువత సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతూ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. గత నెల 28వ తేదీన ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా, బస్తర్, కంకేర్, నారాయణపూర్, రాజ్‌నంద్‌గావ్ జిల్లాలు, జార్ఖండ్‌లోని గుమ్లా, కుంటి, లోహర్‌దగా, లతేహార్ జిల్లాలు, ఒడిశా రాష్ట్రంలోని ఖండమాల్ జిల్లాల నుంచి 220 మంది గిరిజన యువతీ యువకులు పాల్గొన్నారు. విశాఖలోని స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, కైలాసగిరి, సబ్‌మెరైన్ మ్యూజియం, ఆర్.కె.బీచ్ తదితర ప్రాంతాలను వారు సందర్శించారు. ముగింపు కార్యక్రమంలో విశాఖ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బి.రామ్‌నరేష్, సమగ్ర శిక్ష అభయాన్ అదనపు ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, జిల్లా యువజన అధికారి జి.మహేశ్వరరావు, విజయనగరం జిల్లా యువజన అధికారి జి.విక్రమాదిత్య, ఇతర అధికారులు ఎం.సి.బాబురెడ్డి, శ్రీనివాస్, రాంప్రసాద్, వి.పి.దేవి పాల్గొన్నారు.



గిరిజన విద్యార్థులతో నెహ్రూ యువకేంద్రం రాష్ట్ర సంచాలకురాలు విజయరావు

6 నుంచి విశాఖలో ఫిల్మ్ ఫెస్టివల్

దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు విశాఖలో ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్టు సొసైటీ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఫెస్టివల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి తెలుగు టాకీ సినిమా భక్త ప్రహ్లాద విడుదలై 91 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలుగు టాకీ సినిమా ఆవిర్భావ ఉత్సవాల్లో భాగంగా ఈ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. విశాఖ పౌర గ్రంథాలయంలో ప్రతి రోజూ సాయంత్రం 5.45 గంటల నుంచి పలు చిత్రాల ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ నెల 6న జమున నటించిన..ఉండమ్మా బొట్టు పెడతా, 7న మాలపిల్ల, 8న విరాటపర్వం సినిమాలు ప్రదర్శించనున్నట్టు చెప్పారు. ప్రవేశం ఉచితమని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వీజేఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు , వైజాగ్ ఫిల్మ్ సొసైటీ గౌరవాధ్యక్షుడు ఎన్‌పీడీ పాల్, సభ్యులు సంతోష్‌కుమార్, డాక్టర్ బాబ్జి పాల్గొన్నారు.

ఫిల్మ్ మేకింగ్‌పై వర్క్‌షాపు..

ఫెస్టివల్‌లో భాగంగా ఫిల్మ్‌మేకింగ్‌పై 7న ఉదయం 10 గంటలకు పౌరగ్రంథాలయంలో ప్రముఖ సినీ దర్శకుడు వీఎన్ ఆదిత్య (మనసంతా నువ్వే ఫేం) వర్క్‌షాప్ నిర్వహించనున్నారని నరవ ప్రకాశరావు తెలిపారు. ఈ వర్క్‌షాపునకు 18ఏళ్లు దాటిన వారు అర్హులని, మరిన్ని వివరాలకు 9441571581, 9032477463 నంబర్లలో సంప్రదించవచ్చు.

నేడు, రేపు ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక 7వ వార్షికోత్సవం



మాట్లాడుతున్న కె.ఎస్.మల్లేశ్వరి

కూర్మన్నపాలెం : విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసి, దేశం గర్వపడేలా తీర్చిదిద్దడమే ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక 7వ వార్షికోత్సవం ముఖ్య లక్ష్యమని ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక జాతీయ కార్యదర్శి కె.ఎస్.మల్లేశ్వరి అన్నారు. శని,ఆదివారాల్లో ప్రజాస్వామిక రచయిత్రల వేదిక 7వ వార్షికోత్సవం పురస్కరించుకుని జీవీఎంసీ 86వ వార్డు పరిధి కూర్మన్నపాలెంలోని ఓ హోటల్‌లో శుక్రవారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 4,5 తేదీల్లో ఉక్కు నగరం సమీపంలోని దేశపాత్రునిపాలెం సంస్కృతి గ్లోబల్ హైస్కూల్‌లో ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక 7వ వార్షికోత్సవం ఘనంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ఉత్సవంలో వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో పాటు కవులు, రచయితలు, సాహితీవేత్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ వేదికలో రెండు తెలుగు రాష్ట్రాల రయితలు, కవులు, సాహితీవేత్తలు పాల్గొంటారన్నారు. కవులు, రచయితలు మమత, సత్య, గోపి మాట్లాడుతూ వ్యాసం, కథ, కవిత్వం, పాట, ప్రక్రియలపై విద్యార్థుల మనోభావాలను పంచుకోవడం సంతృప్తినిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక జాతీయ సమన్వయకర్త మానస ఎండ్లూరి, ఏపీటీఎస్ రాష్ట్ర నాయకులు వెంకటపతిరాజు, సంస్కృతి గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి, కథా రచయిత దగ్గుబాటి పద్మాకర్, చిన్నపిల్లల కథా రచయిత అనిల్ తదితరులు పాల్గొన్నారు.